# అప్పు

వణుకుతోన్న చేతుల్ని ముందుకు చాచాడు యల్లయ్య.

పది రూపాయల నోట్లు ఎనభై చేతిలో పెట్టి "ఎనిమిది నూర్లు రిస చూసుకో" అన్నాడు కాషియర్.

తలూపాడు.

నీళ్ళు నిండిన కళ్ళకంతా మసగ్గా కన్పిస్తోంటే భారంగా అడుగు లేస్తూ బ్యాంకు గుమ్మం దాటాడో లేదో "యల్లయ్యా" అంటూ పిలుస్తూ వచ్చాడు ప్యూను.

ఆగి ఏమిటన్నట్లు చూశాడు.

వినయంగా నిలబడి వెకిలినవ్వు నవ్వేడు.

ఎన్నోసార్లు కసిరి కొట్టిన అతడిప్పుడు....!

నోట్ల కట్టలోంచి పది నోటు తీసిచ్చాడు.

అతడి కళ్ళు మెరిశాయి. "మూడు నాలుగు నెలల్లో రా. రెండో కం తిప్పిస్తాను".

అభిమానం కురిపించాడు.

చిన్నగా నవ్వి ముందుకి నడిచాడు యల్లయ్య.

జేబులోని నోట్ల బరువు గుండెల బరువు ముందు తేలిపోతోంది,

ఆ డబ్బు కోసం ఎన్ని అడ్డ గాడిదల కాళ్ళు ఎన్ని నిలువు గాడిదల కాళ్లూ పట్టుకున్నాడో లెక్కలేదు. ఎంత ఖర్చయ్యిందో ఆ ఏడు కొండల వాడికి రామయ్య శెట్టికి మాత్రం తెలుసు !

అదంతా మెదళ్ళో కదిలేసరికి కన్నీళ్ళు పొంగాయి.

ఆ సంఘటనలన్నీ కళ్ల ముందు కదిలాయి.

తైలం చెట్లు (యూకలిప్టస్) నాటుకోడానికి సమితిలో అప్పు ఇస్తున్నారనీ అవి నాటితే ఆరేడు సంవత్సరాల్లో ఎకరానికి ఖర్చులు పోను పది వేలు మిగుల్తుందని నలుగురూ అనుకొంటూంటే విన్నాడు యల్లయ్య. అతడికొక్క ఆసక్తి కలిగింది.

తనకున్నదే మూడెకరాల చేను. అందులో ఓ యాభై కుంటల వరకూ రాళ్లూ తుప్పల్తో నిండి ఎందుకూ పనికి రాకుండా వుంది. మిగిలిన చేన్లో శనగ వేస్తున్నాడు గాని వర్షం కురిస్తే పది మూటలవుతున్నాయి. లేకపోతే విత్తనాలు దండగవుతున్నాయి.

అంచేత ఒక ఎకరంలో తైలం చెట్లు నాటితే పనికి రాకుండా వున్న భూమిని ఉపయోగించు కున్నట్టూ వుంటుంది మంచి ఆదాయమూ వస్తుం దన్పించింది.

ఇంకేం ఆలోచించకుండా సమితి ఆఫీసు కెళ్లాడు. ఎవ్వరూ అతడ్ని పట్టించుకోలేదు. సరైనా సమాధానమూ చెప్పలేదు. అయినా పట్టు వదల కుండా కసుక్కొగా లెవల్ వర్కర్ (వీడీవో)ని కలుసుకోమని చెప్పే రొకరు.

అతడు ఆ వూళ్ళోనే వుంటూండటంతో అతడింటి కెళ్లాడు యల్లయ్య. ఆ గ్రామాభివృద్ధి అధికారి అతడ్ని ఎరగడు. అయినా యల్లయ్య చెప్పిందంతా విని 'నా ఏరియా వాడేనన్న మాట' అనుకుని సబ్సిడీ పారాలిచ్చి దాని ఖరీదంటూ పదిరూపాయలు తీసుకున్నాడు.

"తైలంర చెట్లు నాటుకోడానికి ఎకరానికి పద్దైదు నూర్లిస్తాం. నువ్వు చిన్న రైతువి గనుక అయిదు నూర్లు సబ్సిడీ వస్తుంది. అంటే అయిదు నూర్లు తోసేస్తారన్న మాట. నువ్వు పది నూర్లు తీరిస్తే సరిపోతుంది. ఫారెస్టోళ్ళ ద్వారా చెట్లు కూడా ఉచితంగా ఇప్పిస్తాం. ఈ ఫారాలు కరణం చేత రాయించుకుని పట్రా" అన్నాడతను.

యల్లయ్య చాలా సంతోషించాడు. అయిదూ పదీ ఖర్చయితేనేం గాక అయిదు నూర్లు తోపిడి ఇప్పిస్తానంటున్నాడుగా అని సంతృప్తి పడ్డాడు.

నీ మేలు మర్చిపోనన్చెప్పి ఇంటి కొచ్చేశాడు.

సంగతులు విని యల్లయ్య భార్య ఎంతో సంబరపడిపోయింది.

ఏడేళ్లలో సుమారు పదివేలు చేతి కొస్తాయి. సరిగ్గా అప్పటికి ఆడ పిల్ల పెళ్ళి కెదిగొస్తుంది గనుక వాళ్ల కాళ్ళూ వీళ్ళ కాళ్ళూ పట్టుకోనక్కర్లేకుండా అప్పూ సప్పూ చెయ్యనక్కర్లేకుండా తేలిగ్గా పెళ్ళి చేసెయ్యొచ్చని మురిసిపోయారు. అంతా అనుకున్నట్టుగా జరగాలని కొండకి మొక్కుకున్నారు కూడానూ.

భోంచేసి కరణం ఇంటి కెళ్ళాడు యల్లయ్య.

"నువ్వా యల్లయ్యా. ఏవిటి దారి తప్పి వచ్చావ్...." కళ్లద్దాల పై నుంచి చూస్తూ నవ్వేడాయన.

"చిన్న పని బడింది" అంటూ ఫారాలందించి వివరాలు చెప్పాడు.

"చెట్లు పెడతన్నావా. సబ్సిడీ కూడా బాగా వస్తుందిలే. అన్నీ రాసిస్తాన్లేగాని మా అమ్మాయొచ్చింది. టమాటా వూరగాయ కావాలంటోంది. ఓ బుట్టెడు కాయలు పట్రా"

తలూపక తప్పలేదతడికి.

"చేతిలోని పనవ్వగానే రాసుంచుతా. నువ్వెళ్లి పట్రా యల్లయ్యా. అమ్మాయి మబ్బుతోనే వెళ్ళిపోద్ది" కరణం అన్నాడు.

నిట్టూరుస్తూ లేచి రెండు మైళ్ళ మాగాన గల టమాటా చేను దగ్గరి కెళ్ళాడు. పది కుంట్లలో టమాటా మొక్క లేశాడు. మొదటి కాపు బాగానే కాసింది. వర్షాల్లేనందున రెండో కాపు దెబ్బతినేసింది. మొక్కకో కాయ కన్నా ఎక్కువ లేవు. వున్న వాటిల్లో కాస్త పండినవన్నీ అయిష్టంగానే కోసి ఓ బుట్టెడు పట్టుకుని కరణం ఇంటి కెళ్లాడు.

కరణం లేడు. బుట్టని ఇంట్లో ఇచ్చి వాకబు చేయగా ఇప్పుడే వస్తా రన్చెప్పారు ఆడవాళ్ళు. వుస్సురంటూ కూర్చున్నాడు యల్లయ్య.

మబ్బు పడింది. కరణం రాలేదు.

టెంట్ సినిమాకి జనం వెళ్లిపోయారు. అయినా కరణం అయిపు లేడు.

తెల్లారి వస్తానని చెప్పమని చెప్పి నీరసంగా ఇంటి మొఖంపట్టాడు ఇంకో రోజు పని చేటని బాధగా వుంది, అయినా చేసేదేం లేదు గనుక తెల్లారి మళ్ళీ వెళ్లాడు.

కరణం కంటబడే సరికి పనై పోయినట్లేనని పొంగిపోయాడు.

"రా యల్లయ్యా. చిన్న పని బడి రాత్రి తిరపతెళ్ళాను."

"నా కాగితాలు...."

"దాని సంగతికే వస్తున్నా. నీకు తెలుసో లేదో గాని ప్రభుత్వం వారి ఉత్తర్వుల ప్రకారం పెన్షన్ తీసిచ్చినందుకు పదహార్రూపాయలు ఫీజు తీసుకోవాలి. ఇక సర్టిఫికేట్ ఫారాలూ అడంగలూ రాసిస్తునందుకు ఏమి స్తావో నీ ఇష్టం. నేనంతా పక్రమంగా రాసిస్తేనే నీకు సర్టిఫికేట్ అయి దొంద లొస్తుంది. అంతా అందులో నాలుగో వంతు ఇస్తున్నారు"

త్రాప్పడి పోయాడు యల్లయ్య. కరణం నిజమే చెబుతున్నాడో హాస్యానికే అంటున్నాడో బోధ పళ్ళేదు వెంటనే.

అళ్ళర్యాంబ్ఛది నుండి తేరుకుంటూ "నా బతుకు నీకు తెలందే వుంది కరణం" అన్నాడు ఎట్టకేలకు.

"నీ సొమ్మేమైనా ఇమ్మంటున్నానేమిటయ్యా అంత ఇదై పోతు న్నావ్. ప్రభుత్వం వారికే ఇస్తోన్న సబ్సిడీ లోంచి కొంచెం ఇమ్మంటున్నా నంతే. ఇవ్వలేనంటావూ ఇక నీ ఇష్టం మరి" అనేసి పుస్తకాల్లో మునిగి పోయాడాయన.

ఏమీ ఇవ్వకపోతే ఏదీ రాసివ్వడని అర్థమైపోయింది. కన్నీళ్ళు పొంగి వస్తోంటే నిగ్రహించుకుంటూ "ముప్పై రూపాయలిస్తాను కాదనకు" అన్నాడు అర్థింపుగా.

"ఏం లాభం లేదు. అందరూ ఇచ్చినట్టే నిన్నూ ఇమ్మంటున్నాను గాని నిన్నేమీ ఎక్కువ ఇమ్మనటం లేదు కదా" తన దృష్టిలో అంతా సమానమే నన్నట్టన్నాడు.

"యాభై ఇస్తాను. పేదవాడ్ని దయదలిచి రాసి పెట్టు కరణం" బ్రతిమాలాడు.

అతి కష్టం మీద ఒప్పుకుంటున్నట్టు మొఖం పెట్టి తలూపా డాయన.

"ఎక్కడో అక్కడ అప్పు చేసి తెస్తాను. కాగితాలు రాసి పెట్టు" అన్చెప్పి రామయ్య శెట్టింటి కెళ్ళాడు యల్లయ్య.

ఆయనో షావుకారు. యల్లయ్యలాటి ఎందరో రైతుల అవసరాలకి అప్పిచ్చి ఫలసాయం చేతికి రాగానే దాన్ని అయిన కాడికి కొనేసు కుంటాడు. ఒక్కోసారి చేనుసీ మడిసీ కూడా రాయించేసుకుంటాడు. అతడూ అతన్లాంటి వాళ్ళూ తప్ప మరో మార్గాంతరం లేనందున పల్లె లోని పేద గొఱ్ఱెలు కసాయిని నమ్మక తప్పడం లేదు.

"ఏం యల్లయ్యా" పచారీ కొట్లో గల్లా పెట్టె ముందు కూర్చున్న రామయ్య శెట్టి అడిగాడు.

"యాభై రూపాయ లియ్య కరణానికివ్వాలి"

"ఇది వరకే చాలా బాకీ వున్నావు కదా"

"అవుననుకో. తైలం చెట్లకి కాగితాలు రాయిస్తున్నా. యాభై ఇవ్వకపోతే రాసివ్వనంటున్నాడు. అవ్వి రాగానే ఇచ్చేస్తాలే"

"సబ్సిడీ వస్తోంది కదా ఇయ్య. గవర్నమెంటు ఏంజేసినా మీలాటోళ్ళకీ హరిజనులకే గాని మాలాటివాళ్ల కేం జెయ్యదు యల్లయ్యా" అంటూ డబ్బిచ్చాడు.

కరణం చేతిలో దుడ్లు పడగానే వ్రాతబల్ల సొరుగులోంచి కాగితాలు తీసిచ్చాడు.

బస్సు మీద లెవల్ వర్కర్ ఇంటి కెళ్ళి కాగితాలిచ్చాడు యల్లయ్య.

అన్నీ చూసి అన్నాడతను "బాగానే వున్నాయి. రేపు ఆఫీసులో ఇస్తాన్లేగాని ఓ యాభై రూపాయలు పట్రా"

"దేనికి ?"

"అదేం మాట. నేనంటే పూరికే చేస్తాను గాని అందరూ చేస్తారా? పీటి మీద క్లర్కు రాయాలి. మేనేజరు రాయాలి. బీడీవో రాయాలి. అబ్బో చాలా తతంగం వుందిలే. ఏమీ ఇవ్వకపోతే నీ కాగితా లెక్కడికి కదలవు"

మరి మాట్లాడలేకపోయాడు యల్లయ్య. సంగతి ముందే చెబితే ఏకంగా డబ్బు తీసుకునొచ్చేవాడు. రేపు మళ్ళీ డబ్బు తీసుకుని రావాలి. మరో రోజు పని చేటు!

నిట్టూర్చి లేచాడు.

* * *

"ఏం కావాలి ?" బ్యాంకు ఫీల్డాఫీసరు అడిగాడు యల్లయ్యని.

"బ్లాకాఫీసులో కాగితం రాసుకున్నాను. ఇక్కడికి కెళ్ళమన్నారు. అదొచ్చిందేమోనని...."

"దేనికి రాసుకున్నావు ?"

"చెట్లు పెట్టుకోడానికి"

"తైలం చెట్లా ?"

తలూపాడు.

ఏవో కాగితాలు తిరగేశాక అన్నాడు "ఆ చేనుకి డీఫార్మ్ పట్టా గాని విక్రయ దస్తావేజులు గాని వున్నాయా ?"

"వున్నాయి"

"అవి తీసుకుని జామీ నిచ్చే వాళ్ళని తీసుకుని రేపు రా"

చేతులు జోడించి వచ్చేశాడు యల్లయ్య.

కొంచెం ఆలస్యంగా అయ్యింది గాని త్వరగా అప్పు లభిస్తున్నందు కతడి హృదయం ఆనందంతో నిండిపోయింది!

"ఏమన్నాడు ?" ఇంటి ముందే ఎదురై అడిగింది ఇల్లాలు.

"జామీనిచ్చే వాళ్ళని పట్టుకుని తెల్లారి రమ్మన్నాడు.

"అందరూ చెట్లు తెచ్చుకుని పాతేస్తున్నారు"

"తెల్లారి అప్పిస్తే మర్నాడెళ్ళి తెచ్చేస్తాను"

"ఇన్నూరు చెట్లు ఎక్కువే రాయించు. కొన్ని చచ్చినా కలిసొస్తాయి"

అలాగే అంటూ తలాడించాడు.

మర్నాడు మరో పెద్ద మనిషిని తీసుకుని బ్యాంకు కెళ్ళాడు యల్లయ్య.

బ్యాంకు అప్పు దరఖాస్తులనీ పూర్తి చేసి సంతకాలు పెట్టించుకున్నాక "సేవింగ్స్ ఖాతా తెరచి యాభై రూపాయలు డిపాజిట్ చెయ్యాలి" అన్నారు.

"నా దగ్గరేం లేదు మరి. మీరిచ్చే దాన్లో పట్టుకోండి"

వెర్రిబాగులోడ్ని చూసినట్టు చూశారంతా అతడి వంక.

"నువ్వొచ్చి అప్పు కోసం అప్లికేషన్ పెట్టింది ఇప్పుడే కదా. ఇప్పటికిప్పు డెలా ఇస్తాం? అప్పు సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం క్రింద ఇస్తున్నాం కదా. మొదట నీకు మేం అప్పు ఇవ్వగలమని బ్లాకాఫీసుకి రాస్తాం. వాళ్ళు సబ్సిడీ ఫారాలు చిత్తూరు పంపిస్తారు. అక్కడ్నుంచి మాకు సబ్సిడీ డబ్బు వస్తాయి. అప్పుడు నీకు అప్పిస్తాం. అంటే ఎంత లేదన్నా నెలాపది రోజులు పడుతుంది" మేనేజరు వివరించి చెప్పాడు.

అవాక్కై పోయాడు. ఆ పిమ్మట డీలా పడిపోయాడు యల్లయ్య.

బుర్ర గోక్కుని "ఫారెస్టోళ్ళ దగ్గర చెట్లై పోతాయేమోనండి" అన్నాడు.

"అయిపోతే మేమేం చెయ్యగలం చెప్పు? రూల్సు అలా వున్నాయి మరి. ముందు ఎక్కడైనా డబ్బు తెచ్చి డిపాజిట్ కట్టు"

జామీను సంతకం పెట్టిన పెద్ద మనిషిని సాగనంపి రామయ్య శెట్టింటి గుమ్మం ఎక్కాడు యల్లయ్య.

సంగతి విని "ఎందుకొచ్చిన బ్యాంకు అప్పు చెప్పు ? అదొచ్చే సరికి గబ్బు పట్టి పోతావ్" అన్నాడాయన.

యల్లయ్య మౌనం వహించడంతో లోపలి కెళ్ళి డబ్బు తెచ్చిస్తూ "దీంతో ఇన్నూర్లు ఇచ్చినట్టు" అన్నాడు.

మారు మాట్లాడకుండా డబ్బు తీసుకుని బ్యాంకులో కట్టేసి కాళ్ళీడ్చు కుంటూ ఇంటి కెళ్ళాడు.

"అలాగున్నావేంటి" మంచి నీళ్ళిస్తూ అందాయన భార్య.

"పనవ్వలేదు"

"ఏం ?"

"ఇంకా నెల రోజులు పడద్దంట"

"సరి" నీరసంగా చతుకిల బడిందామె.

నెల రోజులయ్యాక బ్యాంకు కెళ్ళాడు యల్లయ్య.

"సబ్సిడీ ఇంకా రాలేదు గాని ఈలోగా గత పదమూడు సంవత్స రాలకీ ఈసీ పట్టుకురా. అలాగే భూమి తనఖా బ్యాంకులోనూ మీ వూరి సొసైటీలోనూ అప్పులేనట్టు కాగితాలు రాయించుకురా" అన్నారు.

నిట్టూర్చి బస్సు మీద సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు కెళ్ళాడు.

అతదొచ్చిన పని తెలుసుకుని "పదమూడు రూపాయలు ఫీజూ పదమూడు రూపాయలు మామూలు ఇచ్చి వెళ్ళు. రెండ్రోజుల్లో ఈసీ ఇస్తాం" అన్నారు బహిరంగంగానే.

ఇక వారి మాటకి తిరుగులేదు గనుక ఆ మొత్తం వారి చేతిలో పెట్టక తప్పలేదు.

అలాగే భూమి తనఖా బ్యాంక్ సూపర్వైజర్ కీ సొసైటీ సెక్రటరీకీ కూడా పదీ పరకా సమర్పించుకుని అప్పుల్లేనట్టు రాసిచ్చిన కాగితాలు తీసు కుని బ్యాంకు కెళ్ళాడు.

"నీ భూమి తాలూకు పట్టానీ ఈసీనీ కరణం సర్టిఫికెట్లనీ తీసుకుని చిత్తూరెళ్ళి మా ప్లీడర్ని కల్సుకోవాలి. భూమి మీది హక్కులన్నీ పూర్తిగా నీవేనని ఆయన చేత రాయించుకు రావాలి"

"ఆ చేను నాదేనండి. పట్టాలో కూడా నాపేరే వుంది. అప్పు డెప్పుడో తాశీల్దారు పట్టా ఇచ్చాడు. కావలిస్తే మా వూరోళ్ళ నడగండి"

"నిజమేనయ్యా. కాని ఆ మాట మా బ్యాంకు వకీలనాలి. అది రూలు"

"ఆయనేం పుచ్చుకుంటాడండి"

"ముప్పై రూపాయలు"

నిండా మునిగిన వాడికి చలే విప్లే అనుకుంటూ వకీలు చిరునామా తీసుకున్నాడు యల్లయ్య— "తీరా పని మాని చిత్తూరెళ్తే ఆయన దొరుకు తాడో లేదో" అని గొణుక్కుంటూ.

*    *    *

"యల్లయ్యగారు మీరేనా?" సైకిలు మీద ఇంటికొచ్చి మరీ అడి గాడో నడివయస్సు వ్యక్తి.

ఓ ప్రక్క భయపడుతూనే తలూపాడు యల్లయ్య.

"మీకు సబ్సిడీ అయిదుసూర్లొచ్చిందండీ"

యల్లయ్య కళ్ళు మెరిశాయి. పద్దినాల్నుండి బ్యాంకు చుట్టూ తిరు గుతున్నాడు దానికోసం.

"కూర్చో"

మంచం వాల్చి లోపలి కెళ్ళి పంచదార నీళ్ళు తెచ్చిచ్చాడు.

"నేను బ్లాకాఫీసులోని గుమస్తానండి. నా వల్లే మీకు సబ్సిడీ వచ్చింది. చిత్తూరు ప్రత్యేకంగా వెళ్ళి మీ పని చేయించుకొచ్చాను. అందు నిమిత్తం వందరూపాయలు ఖర్చయ్యాయి. అవిచ్చేస్తే వెళ్ళిపోతాను"

తోడేలుని చూసిన గొర్రె పిల్లలా భయపడి ఒక్కడుగు వెనక్కేసి భయం భయంగా చూశాడు యల్లయ్య.

అదేమీ పట్టించుకోకుండా సబ్సిడీ నిమిత్తం తనెంత కష్టపడిందీ ఎవరెవరికి ఎంత లంచం ఇచ్చిందీ ఏకరువు పెట్టసాగాడతడు.

ఏం చెయ్యాలో తోచక ఇప్పుడే వస్తానన్చెప్పి వూళ్ళోని పెద్ద మనిషి దగ్గరకి పరుగెత్తి విషయమంతా చెప్పాడు. ఏడుపు ఒక్కటి తక్కు వైనట్టున్న అతడి వంక సానుభూతిగా చూశాడాయన.

"రంగంలోకి దిగేక తప్పే తేపుంది. అదేదో వాడి మొఖాన కొట్టు.

లేకపోతే సబ్సిడీ రాకుండా చేస్తే ఇంతవరకూ అయిన ఖర్చంతా బూడిదలో పోసిన పన్నీరవుద్ది. ఎంతైనా వాళ్ళ చేతుల్లో కలం వుంది" అని సలహా ఇచ్చాడు.

రామయ్యశెట్టి తగ్గర తీసుకునిస్తానన్చెప్పి ఆయన దగ్గర వంద రూపాయలు బదులు పుచ్చుకుని ఆ గుమస్తాని సాగనంపాడు.

అంతా గమనించిన ఆయన భార్య కళ్ళల్లో నీళ్ళు కుక్కుకుని మౌనంగా వుండిపోయింది.

ఆ మరుసటి రోజున జామీనుతన్తో కలిసి బ్యాంకు కెళ్ళాడు యల్లయ్య.

"నీకు సబ్సిడీ వచ్చిందయ్యా. రెవెన్యూ స్టాంపూ పేపర్లకోసం పది రూపాయలు పట్టుకు(రా" అన్నారు.

పట్టుకొచ్చేక (ప్రోనోటూ అవీ రాయించుకున్నారు.

"రేపు నువ్వు చిత్తూరు మా బ్యాంకు దగ్గరకి రా. మా ఆఫీసరు కూడా వస్తారు. నీ భూమిని మాకు తనఖా పెడుతూ అక్కడ సంతకాలు పెట్టాలి. మర్నాడు డబ్బిస్తాం"

నిట్టూర్పడం మర్చిపోయి వాళ్ళవంక గాజు కళ్ళతో చూచి వెను దిరిగాడు.

తెల్లారి చిత్తూరు వెళ్ళి సంతకాలు పెట్టొచ్చాడు.

"యల్లయ్యా! ఇప్పుడు ఎనిమిది నూర్లిస్తున్నాం. మిగతా ఏడు నూర్లూ నాలుగు సంవత్సరాల్లో కంతులు కంతులుగా ఇస్తాం" అన్చెప్పి డుడ్లు చేతిలో పెట్టారు బ్యాంకులో.

అదంతా గుర్తు కొచ్చేసరికి నవ్వూ ఏడుపూ కూడా వచ్చాయి యల్లయ్యకి.

కళ్ళు తుడుచుకుని చేతిలోని ఏడువందల తొంభై రూపాయల వంకో సారి చూసి గుండె దిటవు చేసుకుని రామయ్య శెట్టింటి కెళ్ళాడు.

అతడి చేతిలోని డబ్బు కంటబడేసరి కాయన మొఖం విప్పారింది.

"రా యల్లమ్మా-కూర్చో-లేనొచ్చి నట్టుందే" అంటూ ఆహ్వానించాడు.

"తైలం చెట్ల బాపతు బాకీ లెక్కగట్టు"

"తీర్చేస్తున్నావన్నమాట" అంటూ లెక్కగట్టి అన్నాడాయన "ఈ చెట్లలోనుకోసం మొత్తం అయిదు నూర్లు తీసుకున్నావు. వడ్డీ యాభై అయ్యింది"

ఆ సొమ్మిచ్చేసి ఆ అప్పుకి శ్రీరామ రాయించేసి ఇంటి మొఖం పట్టాడు నిర్వికారంగా.

దారిలో రోడ్డు ప్రక్కనున్న ఓ ఇంట్లోని రేడియోలోంచి కొన్ని మాటలొచ్చి అతడి చెవిలో పడ్డాయ్.

".... సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం వల్ల ఎంతోమంది చిన్న రైతులూ కూలీలూ చేతివృత్తులవారూ దారిద్ర్యరేఖని అధిగమించడమేగాక ఆర్థికంగా ఎంతో ముందంజ వేస్తున్నారు. తమ ఆదాయాన్ని పెంచుకుని సుఖసంతోషాలతో తులతూగుతున్నారు. ఈ పథకం క్రింద ఈ ఏడాది ప్రభుత్వం ఎన్నో కోట్లరూపాయల్ని సబ్సిడీ రూపేణ అందిచ్చి ఎందరో బడుగుజీవుల బ్రతుకుల్లో వెన్నెల్ని కురిపించింది...."

ఆగి అటుకేసి ఓ నిమిషం చూసి గబగబా ముందుకి నడిచాడు.

"తైలం చెట్లు అయ్యిపోయాయంట. బండి కట్టుకెళ్ళిన రామిరెడ్డి తిరిగొచ్చాడు" విచారంగా అందతడి భార్య.

"పోన్లేవే. నేను చెట్లు పెట్టను"

"ఏం?" ప్రూన్పడి పోయిందామె అతళ్ళో అర్థాంతరంగా వచ్చిన మార్పు అర్థంగాక.

"ఇదిగో రెండునూర్ల నలభై మిగిలాయ్. రెండు బండ్లు తోలికెళ్ళి చెట్లుతేవాలి. పారెస్టోళ్ళకి మామూళ్ళివ్వాలి. బండ్లకి కిరాయి ఇవ్వాలి. చేలో రాళ్ళూ రప్పా తీసి బాగుచేసి గోతులు తియ్యాలి. చెట్లు పాతి నీళ్ళు తెచ్చి పొయ్యాలి. కల్ల వెయ్యాలి. ఎరువెయ్యాలి. ఇదంతా చెయ్యాలంటే బ్యాంకు అప్పుగాక మళ్ళీ అప్పు చెయ్యాలే పిచ్చిదానా. కడకివాళ్ళూ పీళ్ళూ కలిసి వున్న చేను పట్టుకుపోయి మనల్ని వీధిలోకి తోలేస్తారే!"

దుఃఖం పొంగిరాగా పుద్వేగంగా అనేసి చిన్నపిల్లాళ్ళా ఏడ్చేశాడు యల్లయ్య.

ఆమె కళ్ళు కుంభవృష్టి కురవడానికి సిద్ధంగా వున్న మేఘాల్లా మారిపోయాయి.

వారి కలలు రాళ్ళూ రప్పల్తో నిండి నీటి వసతి లేక బీటలు వారిన వారి చేనులానే మిగిలిపోయాయి!

—0—

(పల్లకి వారపత్రిక. 13-6-85)